సాక్షి నల్లగొండ

ఆదివారం । 28 । జనవరి । 2024



సైదన్నా.. వెళ్లొస్తాం

పాలకవీడు మండలం జాన్‌పహాడ్ దర్గా ఉర్సు ముగిసింది. చివరి రోజైన శనివారం దీపారాధనలు చేశారు. - 8లో



భక్తుల కోలాహలం

యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి శనివారం భక్తులు పెద్దసంఖ్యలో తరలి రావడంతో కోలాహలం నెలకొంది. - 8లో



విద్యార్థులకు అస్వస్థత

కలుషిత ఆహారం తిని నలుగురు విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటన అనంతగిరిలో చోటుచేసుకుంది. - 8లో

న్యూస్‌రీల్

ఇద్దరు సీఐలు, ఐదుగురు ఎస్‌ఐలు బదిలీ

నల్లగొండ క్రైం: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఇద్దరు సీఐలు, ఐదుగురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. నల్లగొండ డీటీసీలో పనిచేస్తున్న సీఐ కోమట్ల ఆదిరెడ్డిని జడ్చర్ల టౌన్ పీఎస్‌కు, హాలియాలో పనిచేస్తున్న సీఐ గాంధీనాయక్‌ను మహబూబ్‌నగర్ రూరల్ సీఐగా బదిలీ చేశారు. అలాగే నల్లగొండ వీఆర్‌లో ఉన్న ఎస్‌ఐ అంతిరెడ్డిని నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్(పీఎస్)కు, నల్లగొండ వీఆర్‌లో ఉన్న బి.యాదయ్యను చింతపల్లి పీఎస్‌కు, మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ డి.నర్సింహులును వీఆర్ నల్లగొండకు, కట్టంగూర్ ఎస్‌ఐ రాజును తిప్పర్తి పీఎస్‌కు, తిప్పర్తి ఎస్‌ఐ ధర్మాను వీఆర్ నల్లగొండకు బదిలీ చేశారు.

ఎమ్మెల్సీ ఓటుకు నర్సిరెడ్డి దరఖాస్తు



దరఖాస్తును అదనపు కలెక్టర్‌కు అందజేస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

నల్లగొండ: వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓటరుగా ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు శనివారం ఆయన తన దరఖాస్తు ఫారాన్ని నల్లగొండలో అదనపు కలెక్టర్, ఎలక్ట్రోరల్ అధికారి జె.శ్రీనివాస్‌కు అందజేశారు.

పిల్లల మనోవికాసానికి కథల పుస్తకాలు దోహదం



బాలల కథల సంపుటిని ఆవిష్కరిస్తున్న నారాయణరెడ్డి తదితరులు

రామగిరి (నల్లగొండ): పిల్లల మనోవికాసానికి కథల పుస్తకాలు ఎంతగానో దోహదపడతాయని సాహితీవేత్త డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం నల్లగొండలోని నాగార్జున ప్రభుత్వ కళాశాలలో కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి రచించిన బహుమతి బాలల కథల సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. బుచ్చిరెడ్డి కథల్లోని నైతిక విలువలు నేటి తరానికి అవసరమన్నారు. కృష్ణ కౌండిన్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు మునాస్ వెంకట్, మేరెడ్డి యాదగిరిరెడ్డి, అంబటి వెంకన్న, లేకానంద స్వామి, బైరెడ్డి కృష్ణారెడ్డి, శీలం భద్రయ్య, మాదగోని శంకరయ్య, పెరుమాళ్ల ఆనంద్, సాగర్ల సత్తయ్య, మేకల ఉమారెడ్డి, బండారు శంకర్ పాల్గొన్నారు.

మనోళ్ల ఖర్చు ఇంతే!

నిబంధనలకు లోబడే ఖర్చు చేశారట

- ఎన్నికల సంఘానికి లెక్కలు చూపెట్టిన ఎమ్మెల్యే అభ్యర్థులు
- మిర్యాలగూడలో భాస్కర్‌రావు కంటే జూలకంటి రంగారెడ్డి ఖర్చే ఎక్కువ
- పార్టీ ఇచ్చిన దానికంటే తక్కువ ఖర్చు పెట్టిన బీఆర్‌ఎస్ అభ్యర్థులు
- గెలిచిన బాలునాయక్ కంటే ఓడిన రవీంద్రకుమార్ పెట్టిందే అధికం
- నల్లగొండలో కోమటిరెడ్డి, పిల్లి రామరాజు దాదాపు సమాన ఖర్చు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: అసెంబ్లీ ఎన్నికల్లో మనోళ్లు నిబంధనలకు మించి చేసిన ఖర్చేమీ లేదట. ఎన్నికల సంఘానికి ఇచ్చిన లెక్కలే ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. సాధారణంగా ఎన్నికలంటేనే అందరికి గుర్తుకు వచ్చేది గల్లీ కార్యకర్త నుంచి ఢిల్లీ నేతల వరకు హడావుడి తప్పదు. సభలు, సమావేశాలు, రోడ్ షోలు భారీ తతంగమే ఉంటుంది. మైకుల మోత, ప్రచార ఆర్భాటాలు, వీధుల్లో ఇంటింటి ప్రచారం, సామాజిక వర్గాల సమావేశాలు, అపార్ట్‌మెంట్ వాసులతో భేటీలు, చివరగా మందు, విందు, తాయిలాలు సర్వసాధారణమే. ఇందుకు అయ్యే ఖర్చు భారీగా ఉంటుంది. ఈ విషయం బహిరంగ రహస్యమే అయినా, జిల్లాలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులంతా చాలా తక్కువగా ప్రచారం ఖర్చు చేశారట.

నిబంధనల ప్రకారం..

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎంత ఖర్చు చేయాలన్న దానిపై ఎన్నికల నోటిఫికేషన్‌లోనే ఎన్నికల కమిషన్ ఓ నిబంధనలు విధించింది. అభ్యర్థుల ప్రచార ఖర్చు రూ.40 లక్షలకు మించరాదని ఎన్నికల సంఘం అందులో స్పష్టం చేసింది. దీంతో అభ్యర్థులు ప్రచారానికి చేసే ఖర్చు ఆ నిబంధనకు లోబడి ఉండాల్సిందే. లేదంటే సదరు అభ్యర్థిపై అనర్హత వేటు వేస్తుంది. ఒకవేళ ఎన్నికైతే ఆ ఎన్నికను రద్దు చేసే అధికారం ఎన్నికల సంఘానికి ఉంటుంది. కాబట్టి జిల్లాలో పోటీ చేసి, గెలిచిన వారు, ఓడిన వారు సహా మిగితా అభ్యర్థులంతా ఆ నిబంధనలకు లోబడే ఖర్చు చేశారట. ఆ లెక్కలే ఎన్నికల సంఘానికి ఇచ్చారు. దీంతో ఎన్నికల సంఘం కూడా అవే లెక్కలను పరిగణనలోకి తీసుకుంది. ఎన్నికల సంఘానికి సంబంధించిన అధికారులు కూడా అభ్యర్థుల ఖర్చులపైనా నిఘా పెట్టారు. మొత్తానికి జిల్లాలో అభ్యర్థులంతా నిబంధనలకు లోబడే ఖర్చు చేసినట్లుగా అంచనాకు వచ్చారు.

ఎన్నికల సంఘానికి ఇచ్చిన వ్యయ వివరాలు

- దేవరకొండలో గెలుపొందిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే బాలునాయక్‌కు పార్టీ రూ.30 లక్షలు ఇవ్వగా, ఆయన తన ప్రచారం కోసం రూ.18,88,432 ఖర్చు చేశారు. అదే నియోజకవర్గంలో ఓడిపోయిన బీఆర్‌ఎస్ అభ్యర్థి రమావత్ రవీంద్రకుమార్‌కు బీఆర్‌ఎస్ పార్టీ రూ.40 లక్షలు ఇవ్వగా, ఆయన తన ప్రచారం కోసం రూ.23,37,566 ఖర్చు చేశారు.
- నాగార్జునసాగర్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోటీ చేసి గెలిచిన కుందూరు జయవీర్‌రెడ్డి ఎన్నికల్లో తన ప్రచారం కోసం రూ. 31.82 లక్షలు ఖర్చు
- నల్లగొండలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి పార్టీ రూ.30 లక్షలు ఇవ్వగా, అందులో రూ.23,88,393 ఖర్చు చేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డికి బీఆర్‌ఎస్ పార్టీ రూ. 40 లక్షలు ఇవ్వగా, అందులో రూ.16,10,267 ఖర్చు చేశారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) అభ్యర్థిగా పోటీ చేసిన పిల్లి రామరాజు యాదవ్ రూ. 23,68,260 లక్షలు ఖర్చు చేయడం గమనార్హం.

చేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి నోముల భగత్‌కు పార్టీ రూ.40 లక్షలు ఇవ్వగా, అందులో రూ.20,80,839 ఖర్చు చేశారు.

- నకిరేకల్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గెలుపొందిన ఎమ్మెల్యే వేముల వీరేశంకు పార్టీ రూ.30 లక్షలు ఇవ్వగా రూ.23,96,662 ఖర్చు చేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు బీఆర్‌ఎస్ పార్టీ రూ.40 లక్షలు ఇవ్వగా, అందులో ఆయన తన ఎన్నికల ప్రచారం కోసం రూ. 32,85,099 ఖర్చు చేశారు.
- మునుగోడులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి పార్టీ రూ.30 లక్షలు ఇవ్వగా రూ. 30,39,782 ఖర్చు చేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికి బీఆర్‌ఎస్ పార్టీ రూ.40 లక్షలు ఇవ్వగా రూ.29,54,063 ఖర్చు చేశారు.
- మిర్యాలగూడలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గెలుపొందిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి పార్టీ రూ.30 లక్షలు ఇచ్చింది. ఆయన మాత్రం ఎన్నికల ప్రచారం కోసం రూ.15,20,960 ఖర్చు చేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిన మాజీ ఎమ్మెల్యే ఎన్.భాస్కర్‌రావుకు బీఆర్‌ఎస్ పార్టీ రూ.40 లక్షలు ఇవ్వగా, ఆయన రూ.23,95,335 ఖర్చు చేశారు. సీపీఎం అభ్యర్థి జూలకంటి రంగారెడ్డి మాత్రం తన ఎన్నికల ప్రచారం కోసం ఆ ఇద్దరు అభ్యర్థులకంటే ఎక్కువ ఖర్చు చేశారు. తన ప్రచారం కోసం రూ.24,88,785 వెచ్చించారు.

ధరల నియంత్రణలో కేంద్రం విఫలం



మాట్లాడుతున్న బొజ్జ చినవెంకులు

శాలిగౌరారం: రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర సరుకులతో పాటు ఇతర ధరలను నియంత్రించడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొజ్జ చినవెంకులు అన్నారు. శాలిగౌరారంలోని సీపీఎం కార్యాలయంలో శనివారం నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో నరేంద్ర మోదీ కార్పొరేట్ సంస్థలకు దేశ సంపదను దోచిపెట్టేలా పనిచేస్తుందన్నారు. బీజేపీ పాలనలో దేశంలోని సామాన్య, మధ్యతరగతి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 16న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త బంద్‌లో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు డెంకల లింగయ్య, మక్క బుచ్చిరాములు, సిరుపంగి రాములు, కల్లూరి లింగయ్య, వెంకటయ్య, కొమరయ్య, శ్రీను, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

‘చలో ఢిల్లీ’ని జయప్రదం చేయాలి

నల్లగొండ టూటౌన్: ఎస్సీ వర్గీకరణ కోసం ఫిబ్రవరి 5, 6 తేదీల్లో చేపట్టనున్న చలో డిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు పిడమర్తి రవి అన్నారు. శనివారం నల్లగొండ పట్టణంలోని ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం కమిటీ వేసి పార్లమెంట్‌లో బిల్లు పెడతామని చెప్పిన బీజేపీ నాయకులు తమ వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకోకపోతే మాదిగలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో మాదిగ యూత్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు దున్న కొండల్, ఆదిమల్ల శంకర్, పెరిక ఉమా మహేశ్వర్, తీగల జాన్‌శాస్త్రి, గార్లపాటి శేఖర్, మహేష్ పాల్గొన్నారు.



నల్లగొండలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ఏ కష్టం వచ్చినా.. అండగా ఉంటా

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- నల్లగొండ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

నల్లగొండ : నల్లగొండ జిల్లా బిడ్డలకు ఏ కష్టం వచ్చినా.. తాను అండగా ఉంటానని రాష్ట్ర రోడ్లు, భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి భరోసా ఇచ్చారు. నల్లగొండలోని ఐటీఐ కళాశాల ఆవరణలో నిర్మిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ భవన నిర్మాణ పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. అంతకు ముందు నల్లగొండ పరిధిలోని పానగల్‌లో బాలసదనం, వయో వృద్ధుల వసతి గృహ భవన నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. మహిళా ప్రాంగణంలో మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్ నైపుణ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల మంత్రి మాట్లాడుతూ ఇది ఒక భవనం కాదని, నిరుద్యోగ యువతీయువకుల జీవితాల్లో వెలుగులు నింపే దీపమని అభివర్ణించారు. ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ చదువుకున్న నిరుద్యోగ యువతకు మూడు నెలలకు ఒక బ్యాచ్ చొప్పున ప్లంబర్, ఎలక్ట్రీషియన్, కంప్యూటర్ బేసిక్స్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇచ్చి.. వారు స్వయం ఉపాధి పొందేలా చూస్తామని తెలిపారు. వారం పది రోజుల్లో టెండర్ పిలిచి ఆరు నెలల్లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ పనులు పూర్తి చేస్తామన్నారు. అవసరమైతే అదనపు నిధులు కేటాయించి ఈ కేంద్రాన్ని రాష్ట్రంలోనే మోడల్‌గా తీర్చిదిద్దుతామన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో తెలిపిన విధంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నైపుణ్య అభివృద్ధి శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కుట్టు మిషన్ నేర్చుకున్న మహిళలకు కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా కుట్టుమిషన్లు అందిస్తానని, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తానని తెలిపారు. కార్యక్రమాల్లో కలెక్టర్ హరిచందన దాసరి, అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, న్యాక్ డైరెక్టర్ జనరల్ భిక్షపతి, డైరెక్టర్ రాజిరెడ్డి, ఇన్‌చార్జి మున్సిపల్ చైర్మన్ అబ్బగోని రమేష్, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి విజయేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ హరిచందన, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ప్రతి గ్రామానికి వంద ఇళ్లు

నల్లగొండ రూరల్: ఇందిరమ్మ పథకం మొదటి విడతలో భాగంగా ప్రతి గ్రామానికి 100 ఇళ్లు కేటాయిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ మండలంలోని ముశంపల్లి గ్రామంలో రూ.100 కోట్లతో నల్లగొండ–ముశంపల్లి–ధర్మాపురం–కన్నెకల్ రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. సెంట్రల్ లైటింగ్, సైడ్ డ్రైయినేజీలతో ఏడాదిలోపు రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేస్తామన్నారు. గ్రామ హైస్కూల్‌లో విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. హైస్కూల్‌లో ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో పాటు మరో 2 అదనపు తరగతి గదులు నిర్మిస్తామన్నారు. ఎస్సీ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రాన్ని మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆంగ్ల విద్య బోధనకు అధ్యాపకులను నియమించుకుంటే తాను సొంతంగా జీతాలు చెల్లిస్తానని హామీ ఇచ్చారు. త్వరలో మెగా డీఎస్సీ ప్రకటించి ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ముశంపల్లి గ్రామానికి 20 లక్షలు సీసీ రోడ్లకు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, ఎంపీపీ సుమన్, స్థానిక ఎంపీటీసీ, సర్పంచ్ స్వాతి కరుణాకర్‌రెడ్డి , వెంకట్‌రెడ్డి, సహదేవ్, బోధనం వెంకట్‌రెడ్డి, భిక్షం, సైదులు యాదవ్, వెంకన్న యాదవ్ పాల్గొన్నారు.



పానగల్‌లో బాల సదనం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి, చిత్రంలో కలెక్టర్ తదితరులు

పంచాయతీల్లో ‘ప్రత్యేక’ పాలనే..!

- నెలాఖరుతో ముగియనున్న సర్పంచ్‌ల పదవీకాలం
- ప్రభుత్వానికి చేరిన ప్రత్యేకాధికారుల జాబితా
- నేడో, రేపో విడుదల కానున్న అధికారిక ప్రకటన
- హెడ్మాస్టర్లను నియమించడం సరికాదంటున్న ఉపాధ్యాయ సంఘాలు



తిప్పర్తిలో శనివారం వివిధ గ్రామాల సర్పంచ్‌లను సన్మానించిన అధికారులు, జెడ్పీటీసీ సభ్యుడు

నల్లగొండ: గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ఈ నెలాఖరుతో ముగియనుంది. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభించేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఇప్పటికే జిల్లా నుంచి ఆయా గ్రామాల్లో ఏయే శాఖల అధికారులను నియమించాలనే విషయంపై జిల్లా నుంచి నివేదికలను తెప్పించుకుంది. ప్రత్యేక అధికారులుగా తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఈఓలు, సూపరింటెండెంట్లు, పీఆర్ ఏఈలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, టైపిస్టులు, జూనియర్ అసిస్టెంట్లు, ఏఈఓలతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులను వాడుకోవచ్చని ప్రభుత్వం సూచించింది. అయితే హెడ్మాస్టర్లను ప్రత్యేకాధికారులుగా నియమించే విషయంలో ఉపాధ్యాయ సంఘాల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఎవరెవరిని ప్రత్యేకాధికారులుగా నియమిస్తారనే విషయంపై నేడో రేపో ప్రభుత్వం నుంచి స్పష్టత రానుంది.

844 గ్రామ పంచాయతీలు

జిల్లాలో 844 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అందులో 21 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ పదవులు ఖాళీగా ఉన్నాయి. నకిరేకల్ మండలంలో ఏడు గ్రామ పంచాయతీల్లో గతంలో ఎన్నికలు నిర్వహించలేదు. ఇక్కడ ఇప్పటికే ప్రత్యేకాధికారుల పాలన సాగుతోంది. ఇక మిగిలిన 14 గ్రామ పంచాయతీల్లో కొందరు సర్పంచ్‌లు రాజీనామా చేయగా మరికొందరు చనిపోవడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. ఇక్కడ ఉప సర్పంచ్‌లు సర్పంచ్‌లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పుడు ఈ అన్ని పంచాయతీల్లో ప్రత్యేకాధికారులను నియమించనున్నారు.

హెడ్మాస్టర్ల పేర్లు లేకుండానే జాబితా..!

నల్లగొండ జిల్లా నుంచి పంపిన జాబితాలో ప్రధానోపాధ్యాయుల పేర్లు లేవని సమాచారం. పదో తరగతి, ఇతర పరీక్షలు దగ్గర పడుతున్నందున హెడ్మాస్టర్లను ప్రత్యేకాధికారులుగా నియమించడం వల్ల ఇబ్బందులు ఎదురవుతాయనే ఉద్దేశంతో వారి పేర్లను జాబితాలో పంపలేదని తెలిసింది. అయితే రెగ్యులర్ ఉద్యోగులే ప్రత్యేక అధికారులుగా ఉండాలంటే మాత్రం ఇతర శాఖల వారిని తీసుకోవాల్సి ఉంటుంది. కాంట్రాక్టు ఉద్యోగులను తీసుకునేందుకు ప్రభుత్వం అనుమతిస్తే ఉపాధి హామీలో పనిచేసే ఏపీఎంలు, టెక్నికల్ అసిస్టెంట్లను కూడా ప్రత్యేకాధికారులుగా నియమించే అవకాశం ఉంది.

బోధనేతర విధులకు ఉపయోగించొద్దు



గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారులుగా హెడ్మాస్టర్లను నియమించే ఆలోచన సరైంది కాదు. బోధనేతర విధులకు ప్రధానోపాధ్యాయులను ఉపయోగించొద్దు. ప్రస్తుతం పరీక్షలు దగ్గర పడుతున్నాయి. ఈ తరుణంలో హెడ్మాస్టర్లను ప్రత్యేక అధికారులుగా నియమిస్తే విద్యార్థుల నుంచి విద్యను దూరం చేయడమే అవుతుంది. ఈ విధానాన్ని ఉపసంహరించుకోవాలి.

– సోమయ్య, డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

హెడ్మాస్టర్లను మినహాయించాలి



గ్రామ పంచాయతీలో ప్రత్యేక అధికారులుగా హెడ్మాస్టర్లను నియమించొద్దు. ఇప్పటికే పాఠశాలల్లో ఉపాధ్యాయులు సరిపడాలేక బోధనలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ విషయాన్ని దృష్టిలో ప్రభుత్వం ఉంచుకుని ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలి.

– పెరుమాళ్ల వెంకటేశం, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

లోక్‌సభ ఎన్నికల్లో సత్తాచాటాలి

- బీఆర్‌ఎస్ ఆత్మీయ సమావేశంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జగదీశ్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు సత్తాచాటాలని సూర్యాపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నల్లగొండలోని లక్ష్మిగార్డెన్స్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో, అనంతరం జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. హామీలు అమలు చేయమంటే గ్రామాల్లో బీఆర్‌ఎస్‌పై కార్యకర్తలపై దౌర్జన్యాలు చేస్తూ అక్రమ కేసులు పెడుతున్నారని, కేసులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. రానున్న వేసవిలో తాగునీటి సమస్య రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

కేసీఆర్ కాలి గోటికి సరిపోరు

నోటికి వచ్చినట్లు మాట్లాడే కాంగ్రెస్ నాయకులు కేసీఆర్ కాలిగోటికి కూడా సరిపోరని జగదీష్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లాకు చెందిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెత్త వాగుడు వాగుతున్నారని దుయ్యబట్టారు. 420 హామీలిచ్చిన కాంగ్రెస్ నాయకులు 420 వేషాలు వేస్తున్నారని, ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కేసీఆర్ మీద పడి ఏడుస్తున్నారని మండిపడ్డారు. యాదాద్రి పవర్ ప్లాంట్‌లో అక్రమాలు జరిగాయని ఆరోపణలు చేస్తే అసెంబ్లీలోనే సవాల్ చేశానన్నారు. తాను కూడా వ్యక్తిగతంగా మాట్లాడితే మంత్రి కోమటిరెడ్డి బయట తిరగలేడని అన్నారు. కాంగ్రెస్ వచ్చింది గ్రామాల్లో కరెంట్ పోతుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, నల్లగొండ, యాదాద్రి జెడ్పీ చైర్మన్లు బండా నరేందర్‌రెడ్డి, ఏ.సందీప్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఎం.భాస్కర్‌రావు, గాదరి కిషోర్‌కుమార్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి, నాయకులు కంచర్ల కృష్ణారెడ్డి, పంకజ్‌యాదవ్, బొర్ర సుధాకర్, మందడి సైదిరెడ్డి, అభిమన్యు శ్రీనివాస్, మాలె శరణ్యారెడ్డి, తండు సైదులుగౌడ్, వంగాల సహదేవరెడ్డి, కరీంపాష, పల్‌రెడ్డి రవీందర్‌రెడ్డి, ఆలకుంట్ల నాగరత్నంరాజు, భోనగిరి దేవేందర్ పాల్గొన్నారు.

29న స్క్రీనింగ్ టెస్ట్

నల్లగొండ : జపాన్‌లో నర్సింగ్ సిబ్బంది నియామకం కోసం ఈనెల 29న హైదరాబాద్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు తెలంగాణ ఓవర్‌సిస్ మ్యాన్ పవర్ కంపెనీ సిబ్బంది ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ కార్మిక ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ కింద రిజిస్టర్ట్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ జపాన్‌లో స్పెసిఫైడ్ స్కిల్ వర్కర్స్‌గా పని చేసేందుకు అర్హత కలిగిన నర్సింగ్ సిబ్బందికి శిక్షణ, నియామకం కోసం ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 22 నుంచి 30 సంవత్సరాల మధ్య వయసు గల బీఎస్సీతో పాటు నర్సింగ్ గ్రాడ్యుయేట్లు, జీఎన్‌ఎం డిప్లొమా హోల్డర్లు అయిన మహిళా అభ్యర్థులు అర్హులని తెలిపారు. వివరాలకు 8919047600 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఎంపికైన నర్సింగ్ సిబ్బందికి నెలకు లక్షన్నర నుంచి లక్షా 80 వేల రూపాయల వరకు వేతనం ఉంటుందని తెలిపారు.



యువసాయం

ఉన్నత చదువులు పక్కనపెట్టి, ఉన్నత ఉద్యోగాన్ని వదిలి పొలంబాట పట్టారు. ఆధునిక పద్ధతులతో సేద్యం చేస్తూ లాభాలు గడిస్తున్నారు. పలువురికి ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.. భూక్య బిచ్చునాయక్, రమావత్ బాలకృష్ణ.

- ప్రత్యేక కథనం 8లో

సాగర్‌లో అర్బన్ పార్కు ప్రారంభం





నెల్లికల్లు వద్ద ఏర్పాటు చేసిన వ్యూపాయింట్, పర్యాటకులకు ఏర్పాటు చేసిన వాహనం

- జలాశయతీరంలో రూ.1.5కోట్ల వ్యయంతో నిర్మాణం
- పర్యాటకులకు నెల్లికల్లు అటవీ ప్రాంతంలో వ్యూపాయింట్ ఏర్పాటు
- అటవీ అందాల వీక్షణకు సఫారీ వాహనం కూడా..

నాగార్జునసాగర్: సాగర్ జలాశయతీరంలో రూ.1.5కోట్ల వ్యయంతో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ వన్యప్రాణుల అటవీకోర్ ఏరియాలో ఏర్పాటు చేసిన అర్బన్ పార్కును శనివారం అటవీశాఖ అధికారులు ప్రారంభించారు. నాగార్జునసాగర్–హైదరాబాద్, సాగర్–నల్లగొండ రహదారుల (సమ్మక్క–సారక్కల) వెంట 980 హెక్టార్ల విస్తీర్ణంలో పర్యాటకులను ఆకట్టుకునేలా అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్మించారు. 50మంది ఒకేచోట కూర్చొని తినడానికి గజాబాను నిర్మించారు. అటవీ ప్రాంతంలో పార్కు చుట్టూ 2కిలో మీటర్ల మేర ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. గుట్టల్లోంచి పచ్చని వృక్షాల మధ్య గల సాగర్ జలాశయం వెనుక వైపున గల అందాలను తిలకించేందుకు నెల్లికల్లు అటవీ ప్రాంతంలో వ్యూపాయింట్‌ను ఏర్పాటు చేశారు.

ట్రిప్పుకు రూ.1,000లనుంచి రూ1,500లు

పర్యాటకులు అటవీ అందాలను వీక్షించేందుకు సఫారీ వాహనాన్ని ఏర్పాటు చేశారు. ఒక ట్రిప్పులో 8నుంచి 10మంది వెళ్లనున్నారు. ఇందుకు 10కిలో మీటర్ల పరిధికి రూ.1,000 చార్జీ అవుతుండగా 24కిలో మీటర్ల పరిధిలో పర్యటించేందుకు రూ.1500లు చార్జీ వేస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. అడవిలో వివిధ రకాల జంతువులు కనిపిస్తున్నాయని పర్యాటకులు పేర్కొన్నారు. రూ.వెయ్యి, 1500 ఒక కుటుంబ సభ్యులు చెల్లించగలిగితే వారికి ప్రత్యేకమైన ట్రిప్పులు వేస్తామని అధికారులు తెలిపారు. మొదటి రోజు నాలుగు ట్రిప్పులు నడపగా రూ.4వేల ఆదాయం వచ్చినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు.

64కిలోల గంజాయి పట్టివేత

- ముగ్గురు నిందితుల అరెస్ట్
- కారు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం
- సొత్తు విలువ రూ.32.30 లక్షలు

చౌటుప్పల్ : చౌటుప్పల్ మండల పరిధిలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద 64కిలోల గంజాయి పట్టుబడింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో కొనుగోలు చేసిన గంజాయిని కర్నాటక రాష్ట్రంలోని బెంగళూరుకు తరలిస్తుండగా పక్కా సమాచారం మేరకు మల్కాజిగిరి ఎస్‌వోటీ, చౌటుప్పల్ పోలీసులు శుక్రవారం రాత్రి పట్టుకున్నారు. గంజాయితోపాటు రవాణాకు వినియోగించిన కార్లను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. చేపల విక్రయదారుడిగా ఉన్న కేరళ రాష్ట్రంలోని త్రిసూర్ జిల్లా తన్నియాం గ్రామానికి చెందిన పీహెచ్. ఫవాస్(29), భవన నిర్మాణ కార్మికుడైన అదే రాష్ట్రంలోని తిరువనంతపురం జిల్లా వెంగనూర్ గ్రామానికి చెందిన అనంతుమోహన్(25), బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్న మల్లాపురం జిల్లాలోని కలకప్పర గ్రామానికి చెందిన సయ్యద్(39)లు కర్నాటక రాష్ట్రంలోని బెంగళూరుకు చెందిన గంజాయి సరఫరాదారుడితో వేర్వేరుగా పరిచయం ఏర్పర్చుకున్నారు. వారంతా ముఠాగా ఏర్పడి గంజాయిని రవాణా చేసేందుకు సిద్ధమయ్యారు.

అరకు ప్రాంతంలో కొనుగోలు

బెంగళూరుకు చెందిన ప్రధాన నిందితుడి సూచన మేరకు ముగ్గురు నిందితులు గంజాయి రవాణాకు బయలుదేరారు. అందులో భాగంగా గంజాయి సరఫరా కోసం వినియోగించాల్సిన కారును తీసుకొని ఈనెల 24న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అరకు ప్రాంతానికి వెళ్లారు. అక్కడ సరఫరాదారుల వద్ద కొనుగోలు చేసిన 64కిలోల గంజాయిని కారులో నింపి అక్కడి నుండి తిరిగి స్వస్థలాలకు వెళ్లిపోయారు.

అరకు నుంచి హైదరాబాద్ మీదుగా బెంగళూరుకు

కొనుగోలు చేసి రవాణాకు కారులో సిద్ధంగా ఉంచిన గంజాయిని అరకు నుంచి హైదరాబాద్ మీదుగా బెంగళూరుకు తరలించాలనేది నిందితుల పన్నాగం. ఆ ప్రకారంగా ముగ్గురు నిందితులు మరోకారులో ఈనెల 26న అరకుకు చేరుకున్నారు. సరుకు ఉన్న కారుకు మరోకారు ఎస్కార్ట్‌గా పెట్టుకొని బయలుదేరారు. తాము వెళ్లే మార్గంలోని పోలీస్‌స్టేషన్లు, చెక్‌పోస్టుల వివరాలను తెలుసుకుంటూ శుక్రవారం రాత్రి హైవేపై పంతంగి టోల్‌ప్లాజా వద్దకు చేరుకున్నారు. అప్పటికే విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు మల్కాజిగిరి ఎస్‌వోటీ, చౌటుప్పల్ పోలీసులు సంయుక్తంగా ప్రత్యేక ఆపరేషన్ చేపట్టారు. అందులో భాగంగా వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా గంజాయిని తరలిస్తున్న కారు చిక్కింది. అదే సమయంలో ఎస్కార్ట్ వాహనాన్ని సైతం పట్టుకున్నారు. వారి వద్ద నుంచి గంజాయిని, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేశారు. పట్టుబడిన సొత్తు విలువ 32.30లక్షల రూపాయలుగా పోలీసులు అంచనా వేశారు.

యాదాద్రిలో భక్తుల కోలాహలం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో భక్తుల కోలాహలం నెలకొంది. శనివారం శ్రీస్వామిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల వంటి ప్రాంతాలు సందడిగా కనిపించాయి. స్వామివారిని 40వేల మంది భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. స్వామి వారి ధర్మదర్శనానికి సుమారు 3గంటలు, వీఐపీ దర్శనానికి గంటన్నర సమయం పట్టిందని భక్తులు వెల్లడించారు. వివిధ పూజలతో స్వామివారికి నిత్య ఆదాయం రూ.55,43,899 వచ్చినట్లు అధికారులు తెలిపారు.



ఆలయ సన్నిధిలో భక్తుల రద్దీ

సండే స్పెషల్

కృషి ఉంటే మనుషులు రుషులవుతారు అన్నాడో కవి. స్వయంకృషితో ఆ ఇద్దరు యువకులు ఆదర్శ కృషీవలురుగా మారారు. ఉన్నత చదువులను పక్కనపెట్టి ఒకరు, ఉన్నత ఉద్యోగాన్ని వదులుకొని మరొకరు పొలం బాట పట్టారు. వ్యవసాయ రంగంలో అందివస్తున్న ఆధునిక పద్ధతులపై అవగాహన పెంచుకుని మార్కెట్‌లో ధర ఉన్న పంటలను పండిస్తూ లాభాలు గడిస్తున్నారు. వ్యవసాయ కుటుంబ నేపథ్యం వీరికి అండగా నిలవగా తమతోపాటు పలువురికి ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

-నల్లగొండ డెస్క్



తాను సాగుచేస్తున్న చామంతి పూల తోటలో బిచ్చునాయక్

యువసాయం

సాగులో విద్యావంతుల వినూత్న ఒరవడి

- ఉద్యోగం వదిలి ఒకరు.. ఉన్నత చదువులు చదివి మరొకరు
- సరికొత్త ఆలోచనలతో పంటల సాగు
- సొంతంగా మార్కెటింగ్‌తో లాభాల బాట
- అవార్డులు సైతం పొంది ఆదర్శంగా నిలుస్తున్న యువ రైతులు

పాలీహౌస్‌లో పూల తోట

సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలంలోని రాజానాయక్ తండాకు చెందిన భూక్య బిచ్చునాయక్ 2012లో బీటెక్ బయోటెక్నాలజీ పూర్తి చేశాడు. 2018 వరకు ప్రభుత్వ ఉద్యోగం కోసం పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యాడు. కానీ, ఫలితం లేకపోవడంతో ఉద్యోగం రాలేదని నిరాశ చెందకుండా వ్యవసాయ రంగం వైపు దృష్టిసారించాడు. సంప్రదాయ పంటలైన పత్తి, మిర్చి, వేరుశనగ, వరిసాగు వైపు కాకుండా వినూత్న ఆలోచన చేశాడు. పాలీహౌస్‌లో పూల సాగు చేసేందుకు నిజామాబాద్, కరీంనగర్ తదితర జిల్లాల్లో పర్యటించి పంటసాగు, దిగుబడి, మార్కెటింగ్ తదితర అంశాలపై రైతుల నుంచి సమాచారం సేకరించాడు. ఉద్యానవన శాఖ అందిస్తున్న రాయితీలను తెలుసుకొని తుంగతుర్తి మండలంలోని వెంపటి గ్రామంలో తనకున్న 12 ఎకరాల్లో.. ఎకరం భూమిలో పాలీహౌస్ ఏర్పాటు చేశాడు. ఈ పాలీహౌస్ ఏర్పాటుకు ప్రభుత్వం 95శాతం సబ్సిడీ ఇచ్చింది. పాలీహౌస్‌లో అలంకరకణ పూలైన లేత గులాబీ, తెలుపు, పసుపు, ఎరుపు రంగు లాంటి చామంతిని సాగు చేస్తున్నాడు. మంచి లాభాలు గడిస్తూ.. మరికొంత మందికి ఉపాధి కల్పిస్తున్నాడు. గతేడాది జాతీయ ఉత్తమ మిలినీయర్ రైతు–2023 అవార్డును సైతం అందుకున్నాడు.



జాతీయ ఉత్తమ మిలినీయర్ అవార్డును అందుకుంటున్న బిచ్చునాయక్ (ఫైల్)



పాలీహౌస్

ఎకరాకు రూ.6 లక్షల ఆదాయం

బిచ్చునాయక్ తన పాలిహౌస్‌లో నాటేందుకు చామంతి మొక్కలను రూ.2కు ఒకటి చొప్పున మహారాష్ట్రలోని నాసిక్ నుంచి తెప్పించాడు. ఎకరంలో మొత్తం 1,60,000 మొక్కలతో సాగు ప్రారంభించాడు. ప్రస్తుతం ఆయనే మొక్కలు తయారు చేసుకుంటున్నాడు. ఫామ్‌పాండ్ ద్వారా మొక్కలకు నీటిని అందిస్తున్నాడు. ఎకరా సాగుకు మొత్తం ఖర్చు రూ.6,20,000 వస్తుందని.. పూల విక్రయంతో రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు వస్తాయని.. దీనిలో పెట్టుబడి పోను ఎకరాకు సుమారు రూ.5 నుంచి 6లక్షల వరకు మిగులుతాయని బిచ్చునాయక్ పేర్కొన్నాడు.

యువత వ్యవసాయం వైపు రావాలి

యువత ఉద్యోగాల కోసం చూడకుండా స్వయం ఉపాధి సాధించేందుకు వ్యవసాయ రంగంవైపు రావాలి. నిరుద్యోగం కారణంగానే 2018లో నేను వ్యవసాయం వైపు వచ్చాను. పాలీహౌస్ ద్వారా పూలమొక్కలు సాగుచేయడానికి ప్రభుత్వ నుంచి ప్రోత్సాహం బాగుంది. చామంతి పూలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుంది. చామంతి పూలు ఒకేసారి కోతకు వస్తాయి. దీంతో మార్కెటింగ్, ట్రాన్స్‌పోర్ట్ ఇబ్బందులు ఉండవు.

– భూక్య బిచ్చు, రైతు, రాజానాయక్‌తండా

సాఫ్ట్‌వేర్ నుంచి సాగుబడి వైపు



మిరప పంటకు సేంద్రియ ద్రావణం స్ప్రే చేస్తున్న యువరైతు బాలకృష్ణ

నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలం ఎర్రచెరువుతండాకు చెందిన రమావత్ బాలకృష్ణది వ్యవసాయ కుటుంబం. బాలకృష్ణ హైదరాబాద్‌లోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్, ఎంటెక్ పూర్తి చేశాడు. ఆ తరువాత విప్రో సంస్థలో రేడియో ఫ్రిక్వెన్సీ విభాగంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా చేరాడు. కరోనా సమయంలో ఇంటి వద్ద నుంచే ఉద్యోగం చేయాల్సి వచ్చింది. అప్పటి నుంచి సాగుపై మక్కువ పెంచుకున్నాడు. సేంద్రియ ఎరువులతో పంటలు పండిస్తున్నాడు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకుని పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న బాలకృష్ణకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ హరిచందన ఉత్తమ రైతు పురస్కారాన్ని అందజేశారు.

రసాయన ఎరువులతో ప్రారంభించి..

బాలకృష్ణ మొదటగా 2020లో రెండు ఎకరాల్లో మిర్చి, నాలుగు ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశాడు. అందరిలాగానే రసాయన ఎరువులు వాడాడు. వచ్చిన పంట మొత్తం పూర్తిగా పెట్టుబడులకే సరిపోయింది. దీంతో సేంద్రియ ఎరువులతో పంటను సాగు చేయాలని నిర్ణయించుకున్నాడు. యూట్యూబ్ ఛానల్స్ చూసి సేంద్రియ సాగుపై అవగాహన పెంచుకున్నాడు. తర్వాత వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలతో సేంద్రియ పద్ధతిలో సాగు చేపట్టాడు.

సేంద్రియ పద్ధతిలో పెట్టుబడి తక్కువ..

బాలకృష్ణ సేంద్రియ పద్ధతిలో సాగు చేపట్టాడు. సాధారణంగా మిర్చి పంటను రసాయన ఎరువులతో పండిస్తే ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేది. అందుకు ఎకరాకు రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెట్టాలి. సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన మిర్చి పంట ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. పెట్టుబడి ఎకరాకు రూ.5వేల నుంచి రూ.10 వేలు మాత్రమే రావడంతో.. ఎకరానికి రూ.3 లక్షల వరకు లాభం పొందుతున్నాడు.



జీవ ఎరువులు తయారు చేస్తున్న బాలకృష్ణ

సొంతంగానే మార్కెటింగ్



బాలకృష్ణ తయారు చేసిన కారం ప్యాకెట్లు

సాధారణంగా మార్కెట్లో కిలో మిర్చి రూ.200 నుంచి రూ.250 వరకు ఉంటుంది. కానీ, సేంద్రియ పద్ధతిలో పండించిన ఈ మిర్చిని బాలకృష్ణ రూ.350 నుంచి రూ.400 వరకు విక్రయిస్తున్నాడు. హైదరాబాద్, ఇతర నగరాల్లో నివసిస్తున్న వారికి తానే కారం పొడి తయారు చేసి కిలో రూ.500కి అమ్ముతున్నాడు.

సేంద్రియ వ్యవసాయం చేయాలి



ప్రస్తుతం మనం తినే ప్రతీది రసాయనాలతోనే ముడిపడి ఉంది. దీంతో ఆరోగ్య సమస్యలు తలెత్తి అనారోగ్యం బారిన పడుతున్నాం. రైతులు ఆర్గానిక్ పద్ధతుల్లో పంటలను పండించాలి. రసాయన ఎరువుల కంటే సేంద్రియ ఎరువులు వాడితే పెట్టుబడులు కూడా తగ్గుతాయి.

– బాలకృష్ణ, యువరైతు



సైదన్నా.. వెళ్లొస్తాం

ముగిసిన జాన్‌పహాడ్ దర్గా ఉర్సు

- దీపారాధనతో ముగిసిన ఉత్సవాలు
- చివరి రోజు అధిక సంఖ్యలో దర్గాను దర్శించుకున్న భక్తులు



దర్గాలో ప్రత్యేక పూజలు చేస్తున్న ముజావర్ జానీ

పాలకవీడు: జాన్‌హాడ్ దర్గా ఉర్సు ముగిసింది. మూడు రోజుల పాటు సాగిన ఉత్సవాలు శనివారం ముజావర్ జానీ ప్రత్యేక ప్రార్థనల అనంతరం దీపారాధనతో దీపారధనతో ముగిశాయి. ఉత్సవాలకు చివరి రోజు భక్తులు అధిక సంఖ్యలో దర్గాను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్గా సమీపంలోని నాగుల పుట్ట వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. సైదన్నా.. వెళ్లొస్తామంటూ భక్తులు తిరుగు పయనమయ్యారు. ఉత్సవాలు ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

విధుల్లో కొనసాగిన అధికారులు..

ఉర్సుకు ఊహించిన దానికంటే భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో అధికారులు కొంతమేర ఇబ్బందులు పడ్డారు. నిరంతరం దర్గా పరిసరాల్లో చెత్తాచెదారం తొలగించేందుకు ప్రైవేటు కార్మికులను నియమించి పనులు చేపట్టారు. దర్గా ప్రాంగణంలో అధికారులు ఏర్పాటు చేసుకున్న ప్రత్యేక శిబిరాలను తొలగించారు. ఉత్సవాల సందర్భంగా సూర్యాపేట, కోదాడ, మిర్యాలగూడ ఆర్టీసీ డిపోలకు అధికాదాయం లభించింది. మూడు డిపోలకు కలిపి సుమారు రూ.11 లక్షలకు పైగా ఆదాయం లభించినట్లు ఆయా డిపోల మేనేజర్లు వెల్లడించారు.

ఆలయాలను సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తి



అర్వపల్లి ఆలయంలో పూజలు చేస్తున్న హైకోర్టు జడ్జి జస్టిస్ కార్తీక్

సూర్యాపేట రూరల్, అర్వపల్లి: అర్వపల్లిలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి దేవాలయం, తిమ్మాపురంలోని అఖండ జ్యోతిస్వరూప సూర్య నారాయణస్వామి క్షేత్రంతో పాటు సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని శివాలయాలను శనివారం హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్టుపోలియో జడ్జి జస్టిస్ పుల్ల కార్తీక్ సందర్శించారు. ఎరకేశ్వర, నామేశ్వర, త్రికుటేశ్వరాలయాలను దర్శించి పూజలు చేశారు. అర్వపల్లి ఆలయంలో జడ్జిని జెడ్పీటీసీ, న్యాయవాది దావుల వీరప్రసాద్‌యాదవ్ సన్మానించారు. ఆయన వెంట జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రశాంతి, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఆర్డీఓ కృష్ణయ్య, డీఎస్పీ నాగభూషణం, సీఐ అశోక్, రూరల్ ఎస్‌ఐ సాయిరాం, న్యాయవాది కుంభం రణధీర్, ఎస్‌ఐ అంజిరెడ్డి, ఆలయ జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, నాయబ్ తహసీల్దార్ కంట్లమయ్య, అర్చకులు రాంబాబుఅయ్యంగార్, పవన్, సూర్య క్షేత్రం వ్యవస్థాపకుడు కాకులారపు జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

నలుగురు విద్యార్థులకు అస్వస్థత

- కలుషిత ఆహారమే కారణం

అనంతగిరి(కోదాడ): కలుషిత ఆహారం తిని నలుగురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. సూర్యాపేట జిల్లా అనంతగిరి మండల కేంద్రంలోని మండల పరిషత్ పాఠశాలలో 57మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. శనివారం 37మంది విద్యార్థులు పాఠశాలకు హాజరై మధ్యాహ్నం భోజనం చేశారు. విద్యార్థులకు అన్నం, వంకాయ కూర, చారు వడ్డించారు. కొద్ది సేపటి తర్వాత నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థి కొత్తపల్లి సాత్విక్ ఇంటికి నడుచుకుంటూ వెళ్తూ మార్గమధ్యలో స్పృహ తప్పి పడిపోయాడు. అనంతరం ఐదో తరగతి విద్యార్థి బొడ్డుపల్లి బాలు తీవ్ర కడుపు నొప్పితో బాధపడ్డాడు. విషయం తెలుసుకున్న విద్యార్థుల కుటుంబ సభ్యులు వారిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించగా కోలుకున్నారు. వీరితో పాటు మూడో తరగతి విద్యార్థిని నకిరెకంటి విజయ, ఐదో తరగతి విద్యార్థి కోకల సంజయ్‌కి వాంతులయ్యాయి. విద్యార్థుల అస్వస్థతకు కలుషిత ఆహారమే కారణమని మండల వైద్యాధికారి రంజిత్ తెలిపారు. విద్యార్థుల అస్వస్థత విషయం తెసుకున్న తహసీల్దార్ రవికుమార్, ఎంఈఓ సలీం షరీఫ్ పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం పాఠశాలల పురుగులు పట్టిన బియ్యాన్ని మార్చాలని సంబంధిత అధికారులను తహసీల్దార్ ఫోన్‌లో ఆదేశించారు.

పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం అనంతగిరి మండల కేంద్రంలోని మండల పరిషత్ పాఠశాలకు చేరుకుని ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం అందించే పౌష్టిక ఆహారానికి బదులు కలుషిత ఆహారం పెట్టి విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎంఈఓ సలీం షరీఫ్‌కు ఫిర్యాదు చేశారు. పాఠశాలలో కనీసం మంచినీటి సౌకర్యం కల్పించకపోవడంతో విద్యార్థులు ఇంటి నుంచే తెచ్చుకుంటున్నారని ఆవేదనవ్యక్తం చేశారు. బాత్‌రూంలు కూడా సరిగా లేకపోవడంతో పిల్లలు ఇబ్బంది పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రతిరోజు వండిన ఆహారాన్ని ముందుగా ఓ ఉపాధ్యాయుడు తినాలని, ఆతర్వాతే విద్యార్థులకు వడ్డించాలని ఎంఈఓ ఆదేశించారు. అధే విధంగా పాఠశాలలో మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

మోత్కూరు : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి మోత్కూరు మున్సిపాల్టి పరిధిలోని రాజన్నగూడెం గ్రామ స్టేజి వద్ద చోటు చేసుకుంది. మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని కొండగడప గ్రామానికి చెందిన 4వ వార్డు కౌన్సిలర్ ఎర్రవెల్లి మల్లమ్మ, యాదయ్య దంపతుల చిన్న కుమారుడు ఎర్రవెల్లి పరశురామ్ (32) హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. పరశురామ్ శుక్రవారం స్వగ్రామం కొండగడపకు వచ్చి రాత్రి తిరిగి వరుసకు సోదరుడైన ఎర్రవెల్లి నరేష్‌తో కలిసి హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో నరేష్ నడుపుతున్న బైక్ అదుపు తప్పి కిందపడటంతో పరశురామ్ కిందపడి మృతి చెందగా నరేష్‌కు గాయాలయ్యాయి. మృతదేహాన్ని భువనగిరి ఆస్పత్రికి తరలించారు. గాయపడిన నరేష్‌ను హైదరాబాద్‌లోని కాకతీయ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మృతుడు పరశురామ్‌కు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

యాదగిరిగుట్ట రూరల్ : రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన యాదగిరిగుట్ట మండలంలోని పెద్దకందుకూరు గ్రామ పరిధిలోని రైల్వే గేట్ సమీపంలో శనివారం చోటుచేసుకుంది.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన పధూమ్ లాల్ బంజారే (37) కాచిగూడ నుంచి స్వరాష్ట్రానికి వెళ్తున్న రైలులో ప్రయాణిస్తున్నాడు. ఈ క్రమంలో యాదగిరిగుట్ట మండలం పెద్దకందుకూరు రైల్వే గేట్ సమీపానికి రాగానే ఆ వ్యక్తి రైలులో నుంచి జారి క్రింద పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడిని ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జీఆర్‌పీ పోలీసులు వివరాలు సేకరించి కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని యువకుడి బలవన్మరణం

యాదగిరిగుట్ట రూరల్: ఉరివేసుకుని ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. యాదగిరిగుట్ట మండలం గ్రామానికి చెందిన పుచ్చుల మధు (21) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి తమ వ్యవసాయ బావి వద్ద తాడు సహాయంతో చెట్టుకు ఉరివేసుకున్నాడు. శనివారం ఉదయం పొలం వద్దకు వచ్చిన తన తండ్రి జహంగీర్ ఉరివేసుకున్న కొడుకును చూసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. తన కుమారుడి మృతిపై అనుమానం ఉందని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్ తెలియజేశారు.